సాక్షి చిత్తూరు

ఆదివారం । 28 । మే । 2023



చిన్నశేషుడిపై గోవిందుడి రాజసం

శ్రీగోవిందరాజస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారు చిన్నశేష వాహనంపై విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు.

- 8లో



ఏఈల జీతాల నుంచి రికవరీ

ఉమ్మడి జిల్లా ట్రాన్స్‌కో పరిధిలో వర్క్‌ఆర్డర్లు క్లోజ్ చేయని ఏఈల జీతాల నుంచి ఆ మొత్తం రికవరీ చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి.

- 8లో

	గరిష్ఠం	కనిష్ఠం
చిత్తూరు	39	27
తిరుపతి	40	28
తిరుమల	35	23
గూడూరు	42	23
నగరి	41	28

న్యూస్‌రీల్

బదిలీలన్నీ పారదర్శకం



ప్రభాకర్‌రెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: జెడ్పీ పరిధిలో బదిలీలన్నీ పారదర్శకంగా నిర్వహించనున్నట్లు సీఈఓ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఆయన కార్యాలయంలో శనివారం మీడియాతో మాట్లాడారు. బదిలీల కోసం ఇప్పటి వరకు దాదాపు 150 దరఖాస్తులు వచ్చినట్లు వివరించారు. గత సంవత్సరం 550 మంది వరకు ఉద్యోగులు బదిలీ అయినట్లు గుర్తు చేశారు. ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాల ప్రకారం దరఖాస్తులను పరిశీలిస్తున్నట్లు చెప్పారు. ఒకే చోట ఐదేళ్లు పూర్తి చేసినవారికి తప్పనిసరిగా స్థాన చలనం కల్పిస్తామన్నారు. రెండేళ్లు పూర్తయిన వారు పరిపాలన గ్రౌండ్స్ కింద బదిలీలు చేపట్టే అవకాశాలు తక్కువగా ఉన్నాయని వెల్లడించారు. జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, కలెక్టర్ షణ్మోహన్ ఆదేశాల మేరకు బదిలీ ప్రక్రియకు సంబంధించి ఓ కమిటీని ఏర్పాటు చేసి పారదర్శకంగా పనులు చేస్తున్నామన్నారు. దరఖాస్తులను పరిశీలించి వివరాలను తెలియజేస్తామని వివరించారు

ముగిసిన ఉద్యోగోన్నతి ప్రక్రియ

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో ఎస్జీటీ నుంచి స్కూల్ అసిస్టెంట్ కేడర్‌కు ఉద్యోగోన్నతి ప్రక్రియ నిర్వహించారు. రెండు రోజుల పాటు జరిగిన ఈ ప్రక్రియ శనివారంతో ముగిసింది. ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని సర్కారు బడుల్లో పనిచేస్తున్న 217 మంది సీనియర్ ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతి కల్పించారు. ఈ ప్రక్రియను డీఈవో విజయేంద్రరావు పర్యవేక్షించారు. ఉమ్మడి చిత్తూరు పరిధిలో పలువురు టీచర్లు, సంఘ నాయకులు ఈ కౌన్సెలింగ్‌లో పాల్గొన్నారు.

అంగన్‌వాడీ భవనాలు పూర్తి చేయండి



అధికారులకు సూచనలు ఇస్తున్న తిరుపతి ఐసీడీఎస్ పీడీ జయలక్ష్మి

పుత్తూరు రూరల్: నాడు–నేడు రెండో విడత పనుల్లో చేపట్టిన అంగన్‌వాడీ భవన నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని తిరుపతి జిల్లా ఐసీడీఎస్ పీడీ జయలక్ష్మి అధికారులను ఆదేశించారు. శనివారం పుత్తూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో జరుగుతున్న అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులను ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆమె మీడియాతో మాట్లాడుతూ పుత్తూరు ప్రాజెక్టు పరిధిలో 5 నూతన భవన నిర్మాణాలు కొనసాగుతున్నాయని తెలిపారు. వడమాలపేట మండలం వడ్డిపల్లి, పుత్తూరు పట్టణ పరిధిలోని చెంగనగుంట, తాయిమాంబాపురం, చౌటూరు, వినాయకపురం ఎస్టీ కాలనీల్లో నిర్మాణాలు జరుగుతున్నట్లు వివరించారు. ఒక్కో భవనానికి రూ.14 లక్షల చొప్పున మొత్తం రూ.70 లక్షలతో పనులు జరుగుతున్నట్లు తెలిపారు. జూన్ నెలాఖరికి పనులు పూర్తి చేయాలని అధికారులకు లక్ష్యాన్ని నిర్దేశించినట్లు తెలిపారు. భవన నిర్మాణ నాణ్యత విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించి గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకునే విధంగా అవగాహన కల్పించాలని అంగన్‌వాడీ వర్కర్లకు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో సీడీపీఓ పద్మజ, వైఎస్సార్‌సీపీ నాయకుడు జయరామిరెడ్డి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి అర్బన్: బిందు సేద్య పరికరాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా సూక్ష్మసేద్య అధికారి సతీష్ తెలిపారు. ఆసక్తి గల రైతులు ఈనెల 31వ తేదీలోపు కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో దరఖాస్తులు ఇవ్వాలని సూచించారు. అదనపు సమాచారం కోసం 7995009490 నంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

> "ఈ ప్రాజెక్టులు పూర్తయితే పడమటి నియోజకవర్గాలు సస్యశ్యామలం అవుతాయి. ప్రజలకు తాగునీటి సమస్య శాశ్వతంగా పరిష్కారమవుతుంది. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి మంచి పేరు వస్తుంది. ఈ వాస్తవాలన్నీ తెలుసుకున్న చంద్రబాబు కేసుల పేరుతో అడ్డుతగిలారు. ఎందుకంటే అభివృద్ధిని అడ్డుకోవడమే ఆయన నైజం. చంద్రబాబు హయాంలో అభివృద్ధి చేయలేదు. ఇప్పుడు ఎవరూ చేయకూడదన్న దురుద్దేశంతోనే మూడు ప్రాజెక్టులను అడ్డుకునేందుకు సర్వశక్తులూ ఒడ్డుతున్నారు. కానీ అవేవీ ఫలించబోవు. న్యాయం మన వైపే ఉంది. ఇక్కడ ప్రాజెక్టులను నిర్మిస్తాం.. ఈ ప్రాంతాన్ని సుభిక్షంగా మారుస్తాం."
>
> – పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, ఎమ్మెల్యే, తంబళ్లపల్లె





సోమల: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి (ఇన్‌సెట్) సభకు హాజరైన రైతులు, ప్రజలు

ప్రాజెక్టులు నిర్మిస్తాం.. సస్యశ్యామలం చేస్తాం

- చంద్రబాబు అభివృద్ధి చేయడు.. చేయనివ్వడు
- 7 వేల ఎకరాలు కబ్జా చేసింది టీడీపీ నేతలే
- కుప్పంలో బాబు దోపిడీ రూ.300 కోట్లు
- ధ్వజమెత్తిన ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి

పుంగనూరు: పడమటి నియోజకవర్గాలకు సాగు–తాగునీరు అందించడం కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మంజూరు చేసిన ముదివేడు, నేతిగుట్లపల్లె, ఆవులపల్లె ప్రాజెక్టులపై చంద్రబాబునాయుడు తప్పుడు కేసులు వేసి అడ్డుకోవడంపై తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమల మండలం ఆవులపల్లె ప్రాజెక్టు వద్ద సాధన సమితి ఆధ్వర్యంలో శనివారం రైతుల సదస్సు నిర్వహించారు. దీనికి చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, టీటీడీ బోర్డు మెంబరు పోకల అశోక్‌కుమార్, రాష్ట్ర జానపద కళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శులు పెద్దిరెడ్డి, బైరెడ్డిపల్లె కృష్ణమూర్తి, రెడ్డెప్ప హాజరయ్యారు.



సోమల: ఆవులపల్లెలో నిర్మిస్తున్న ప్రాజెక్టు

చంద్రగిరిలో ఓడిపోయి.. కుప్పం పారిపోయి

ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి మాట్లాడుతూ ఎన్‌టీఆర్‌ను చంపి టీడీపీని లాక్కున్న చంద్రబాబుకు దమ్ముంటే కొత్తపార్టీ పెట్టి గెలవాలని సవాల్ విసిరారు. ఆయన సీఎంగా ఉన్న 14 ఏళ్లలో కుప్పానికి కానీ, చిత్తూరు జిల్లాకు కానీ ఏమీ చేయలేదని గుర్తు చేశారు. కుప్పంలో రూ.140 కోట్లతో నిర్మించాల్సిన ప్రాజెక్టుకు రూ.440 కోట్లు ఖర్చు చేసి రూ.300 కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. చంద్రగిరిలో ఓడిపోయి కుప్పంకు పారిపోయాడని ఎద్దేవా చేశారు. కుప్పం మున్సిపాలిటీ అభివృద్ధికి రాష్ట్ర మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ప్రాజెక్టులపై కోర్టులకు వెళ్లినా తగిన సాక్ష్యాధారాలతో గెలుస్తామని, న్యాయం తమ వైపే ఉందని ధీమా వ్యక్తం చేశారు. సోమల మండలంలో 7 వేల ఎకరాలు అటవీ భూమిని టీడీపీ నేతలు కబ్జా చేశారని ఆరోపించారు. సీతమ్మ చెరువులో ప్రాజెక్టు నిర్మించి తీరుతామని, దీని ద్వారా పీలేరు, రొంపిచెర్ల, పులిచెర్ల, సదుం, సోమల మండలాలకు తాగునీరు–సాగునీరు అందిస్తామని తెలిపారు. "తెలుగుదేశం ప్రభుత్వంలో ఒక్క అభివృద్ధి కార్యక్రమమైనా జరిగిందా? ఉంటే రండి బహిరంగంగా చర్చిద్దాం." అని ఎమ్మెల్యే సవాల్ విసిరారు.

ఈ సమావేశంలో రాష్ట్ర ఏకిల సంఘం అధ్యక్షుడు మురళీధర్, ఎంపీపీలు సురేంద్రరెడ్డి, ఈశ్వరయ్య, గాజుల రామ్మూర్తి, జెడ్పీటీసీలు సోమశేఖర్‌రెడ్డి, దామోదర్‌రాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు రెడ్డీశ్వరరెడ్డి, పృథ్వీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇది భగీరథ యత్నమే



పడమటి నియోజకవర్గాలకు అవసరమైన తాగునీరు–సాగునీరు అందించేందుకు మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సుమారు రూ.2,300 కోట్ల అంచనాలతో మూడు ప్రాజెక్టుల నిర్మాణం కోసం భగీరథ యత్నం చేపట్టారని చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప కొనియాడారు. దీనికి ముఖ్యమంత్రి పూర్తి సహకారం అందించారని చెప్పారు. గతంలో మనం జమీందారులు నిర్మించిన చెరువులు మాత్రమే చూస్తున్నామన్నారు. కానీ మంత్రి పెద్దిరెడ్డి సుమారు 6.5 టీఎంసీల నీటిని నిల్వ చేసే మూడు ప్రాజెక్టులను నిర్మిస్తుంటే అడ్డుకోవడం, తప్పుడు కేసులు వేయడం శోచనీయమన్నారు. ప్రాజెక్టుల నిర్మాణంలో ప్రతి ఒక్కరికి తగిన పరిహారం అందిస్తామని స్పష్టం చేశారు. సుమారు 10 వేల ఎకరాలకు సాగునీరందించే ప్రాజెక్టు నిర్మిస్తుంటే టీడీపీ ఏ రకంగా అడ్డుకుంటుందో ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని మట్టి కరిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు. ప్రాజెక్టులపై సమావేశం జరుగుతుండగా టీడీపీ నాయకులు ప్రాజెక్టు స్థలాల్లో హెలికాప్టర్ ద్వారా ఏరియల్ సర్వే నిర్వహించడంపై ఎంపీ రెడ్డెప్ప ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ నాయకులు ఏరియల్ సర్వేల కోసం లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తూ, ప్రాజెక్టులను అడ్డుకోవడం ప్రజలు గమనించాలని సూచించారు. "హెలికాప్టర్‌లో కాకపోతే నేరుగానే వచ్చి సర్వే చేసుకోవచ్చు. ఇక్కడ ఎవరికీ అన్యాయం జరగడం లేదు."అన్న మాటలతో ప్రజలు, రైతులు నినాదాలతో హర్షం వ్యక్తం చేశారు.

అభివృద్ధి నిరోధకుడు చంద్రబాబు



తన హయాంలో అభివృద్ధి చేయలేక ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధిని చూసి సహించలేక అడ్డుకునే ప్రయత్నాలు చంద్రబాబునాయుడు చేయడం శోచనీయమని టీటీడీ బోర్డు మెంబరు పోకల అశోక్‌కుమార్ అన్నారు. చంద్రబాబు పాలనలో కరువు కాటకాలతో ప్రజలు తల్లడిల్లిపోయారని తెలిపారు. జగన్ పాలనలో ప్రజలు సుభిక్షంగా ఉన్నారని కొనియాడారు.

తవణంపల్లెలో గాలీవాన బీభత్సం

తవణంపల్లె: పెనుగాలులతో కూడిన వర్షం మండలంలో శనివారం సాయంత్రం బీభత్సం సృష్టించింది. పంటలకు తీవ్ర నష్టం కలిగించింది. పెనుగాలులకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, కరెంటు స్తంభాలు నేలమట్టమయ్యాయి. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. రామానాయుడుపాళెంలో సుబ్బారెడ్డికి చెందిన రేకుల ఇల్లు పైకప్పు ఎగిరిపోయింది. అరగొండ సబ్‌స్టేషన్ పరిధిలో మూడు ట్రాన్స్‌ఫార్మర్లు, సుమారు 20 కరెంటు స్తంభాలు నేలకూలాయి. ఎగువ మత్యం దగ్గర కొబ్బరి చెట్లు, అరటి చెట్లు, మామిడి చెట్లు విరిగిపోయాయి. మామిడి కాయలు నేలరాలాయి. అకస్మాత్తుగా మత్యం, మట్టుకూరు పంచాయతీల పరిధిలో మామిడి పంట దెబ్బతింది. మారేడుపల్లె దగ్గర తీవ్ర గాలులకు విద్యుత్ లైన్ తెగిపోయి సరఫరాకు అంతరాయం కలిగించింది. విద్యుత్ శాఖ ఏడీఈ సుబ్రమణ్యం పర్యవేక్షణలో అరగొండ ఏఈ కిషోర్ కుమార్, పైపల్లె ఏఈ కిరణ్‌కుమార్ కరెంటు సరఫరాకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టి విద్యుత్ సరఫరా చేయిస్తున్నారు.



రామానాయుడుపాళ్యం వద్ద కూలిన ట్రాన్స్‌ఫార్మర్



ఎగిరిపోయిన ఇంటిపై కప్పు

భానుడి నిప్పుల వర్షం

- రోహిణీ కార్తెతో మరింత పెరిగిన ఎండలు
- జిల్లాలో మరో 15 రోజులు ఇదే పరిస్థితి
- నైరుతి వస్తే తప్ప చల్లని మాటలేదు

జిల్లాలో ఉష్ణోగ్రత వివరాలు

తేదీ	గరిష్ఠం	కనిష్ఠం
21	39	26
22	40	27
23	39	28
24	38	27
25	39	27
26	40	28
27	40	28

చిత్తూరు అర్బన్: జిల్లాలో సూరీడు నిప్పులు కక్కుతున్నాడు. భానుడి దాటికి అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వారం క్రితం జిల్లాలో కనిష్ఠ ఉష్ణోగ్రత 25.2 డిగ్రీలు ఉండగా సోమవారం ఒక్కసారిగా 28 డిగ్రీలు దాటిపోయింది. గరిష్ఠ ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలను ఎప్పుడో దాటేశాయి. రానున్న రోజుల్లో ఇది మరింత ఎక్కువగా నమోదయ్యే అవకాశం ఉంది. రెండు రోజులుగా జిల్లాలో ఒక్కసారిగా నిప్పుల వర్షం కురుస్తోంది. జనం నీరసించి పోయి ఆస్పత్రుల పాలవుతున్నారు. ఇక ఇళ్ల నుంచి చిన్న పిల్లలు, వృద్ధులు రోడ్లపైకి రావాలంటేనే భయపడిపోతున్నారు. తరచూ ఈదురుగాలులతో కూడిన వర్షం కురుస్తున్నప్పటికీ వాతావరణం అప్పుడు మాత్రమే చల్లగా ఉంటోంది. వర్షం ఆగిపోయిన మరుసటి రోజు ఉదయం నుంచే సూర్యుడు భగ్గుమంటున్నాడు.

అన్ని చోట్లా ఇదే పరిస్థితి

జిల్లాలోని చిత్తూరు, నగరి, ఎస్ఆర్ పురం, పాలసముద్రం, జీడీనెల్లూరు, పూతలపట్టు, గుడిపాల, యాదమరి, తవణంపల్లె, పెనుమూరు తదితర మండలాల్లో ఎండలు విపరీతంగా ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో ఉదయం 7 గంటల నుంచే సూరీడు నిప్పులు కక్కుతున్నాడు. ఉదయం నుంచే ఫ్యాన్లు, ఏసీలు ఆన్ చేసినా వాతావరణం ఏమాత్రమూ చల్లబడడం లేదు. ఏసీని 17 డిగ్రీలకు ఉంచినా గది వాతావరణం ఆ స్థాయికి చేరుకోవడానికి రెండు గంటలు పడుతోంది. బస్సులు, రైళ్లలో ప్రయాణించేవాళ్లు నీరసించి పడిపోయే పరిస్థితి. ఉదయం నుంచే ఎండలు బెంబేలెత్తిస్తుంటే రాత్రులు ఉక్కపోతతో జనం అల్లాడిపోతున్నారు. ఒకటి రెండు మార్లు రాత్రుల్లో స్నానాలు చేసినా వేసవి తాపం మాత్రం తీరడం లేదు. ఎండల్లోకి వెళ్లేటప్పుడు తప్పనిసరిగా టోపీలు, గొడుగులు, ముఖానికి చేతి రుమాలు, సన్‌గ్లాస్ వంటివి ధరించాలని వైద్యులు సూచిస్తున్నారు.

ఇక్కడ కాస్తా బెటర్

ఉష్ణోగ్రతల విషయంలో పలమనేరు మీదుగా పశ్చిమాన ప్రయాణం చేసేటప్పుడు వాతావరణం కాస్త వేడి తక్కువ కనిపిస్తోంది. పలమనేరు, పుంగనూరు. వి.కోట కుప్పం, శాంతిపురం ప్రాంతాల్లో ఎండల తీవ్రత పెద్దగా లేదు. ఉదయం నుంచి రాత్రి వరకు గది ఉష్ణోగ్రత 20 నుంచి 30 డిగ్రీలుగా ఉంటోంది. ఒకే జిల్లాలో ఇలా రెండు విభిన్నమైన ఉష్ణోగ్రతలు నమోదవడం విశేషమే. అయితే రానున్న రోజులన్నీ ఇలాగే ఉంటుందనే నమ్మకం లేదు.

ఆస్పత్రులు కిటకిట

భానుడి ప్రతాపంతో వడదెబ్బకు గురైన వారు ప్రభుత్వ ఆస్పత్రుల్లో క్యూకడుతున్నారు. ఓపీల సంఖ్య పెరుగుతోంది. ప్రైవేటు ఆస్పత్రుల్లో కూడా జనం కిటకిటలాడుతున్నారు. ఇంకొన్ని రోజులు సూర్యుడి ప్రతాపం ప్రజలపై ఉంటుందని, దీని నుంచి ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

> **మండే సూర్యుడితో జాగ్రత్త**
>
> ఈ ఎండలకు తట్టుకోలేం. చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు విలవిల్లాడిపోతున్నారు. ఉదయం నుంచే ఎండలు విపరీతంగా ఉన్నాయి. ఇలాంటి తరుణంలో ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలి. పిల్లలను బయటికి పంపకుండా తగుజాగ్రత్తలు తీసుకోవాలి. ఎండ దాటికి అనారోగ్యానికి గురైతే తక్షణం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లాలి. తగిన వైద్యం చేయించుకోవాలి. నిర్లక్ష్యం వద్దు.
>
> –రవిరాజు, వైద్య నిపుణులు

హజ్ యాత్రికులకు వ్యాక్సిన్

చిత్తూరు రూరల్: హజ్ యాత్రకు వెళ్లే యాత్రికులకు ప్రభుత్వం వ్యాక్సిన్‌లను సరఫరా చేసినట్లు డీఐఓ రవిరాజు అన్నారు. నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. హజ్‌యాత్రలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు మెనింగోకోకల్, సీజనల్ ఇన్‌ఫ్లూ యెంజా అనే వ్యాక్సిన్లను సరఫరా చేసిందన్నారు. యాత్రకు వెళ్లేవారికి ఈ వ్యాక్సిన్లను అందించనున్నట్లు వివరించారు. చిత్తూరులోని గూలింగ్స్‌పేట కమ్యూనిటీ భవనం, పుంగనూరులోని ఉర్దూ స్కూల్లో ఆదివారం ఉదయం నుంచి వ్యాక్సిన్ వేస్తారని చెప్పారు. యాత్రకు వెళ్లేవారు విధిగా ఈ వ్యాక్సిన్లను వేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఐఓ రవిరాజు

నేడు రథోత్సవం

యాదమరి: యాదమరిలో వెలసిన ఇంద్రవరదుని వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం మధ్యాహ్నం స్వామివారి రథోత్సవం నిర్వహించనున్నారు. శనివారం స్వామివారి రథోత్సవానికి ద్వారపాలకులు, రాక్షస, అశ్వములను అలంకరించారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించనున్నారు. అనంతరం సర్వాంగ సుందరంగా అలంకరించిన రథంపై స్వామివారిని కొలువుదీర్చి మాడ వీధుల్లో ఊరేగించనున్నారు.



వినాయకునికి వెండి బిస్కెట్ల విరాళం



వెండి కాసులు, బిస్కెట్లను అందిస్తున్న దాత కుటుంబ సభ్యులు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామికి హైదరాబాద్‌కు చెందిన కార్తికేయ వెండి లక్ష్మీకాసులు, బిస్కెట్లు విరాళంగా అందించారు. శనివారం రాత్రి దాత కుటుంబ సభ్యులు స్వామివారి దర్శనార్థం విచ్చేసి సుమారు 4.6 కిలోల (రూ.4లక్షలు) వెండి లక్ష్మీకాసులు, బిస్కెట్లు ఈవో వెంకటేశుకు అందించారు. ఆలయ అధికారులు స్వామివారి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ శ్రీధర్‌బాబు, ఇన్‌స్పెక్టర్ బాలాజీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చోరీ కేసుల్లో ఆరుగురి అరెస్టు



నిందితుల అరెస్టు చూపుతున్న పోలీసులు

సదుం: సోమల, సదుం, పులిచెర్ల మండలాల్లో చెరుకు గానుగ క్రషర్లను చోరీ చేసిన ఆరుగురు నిందితులను శనివారం అరెస్టు చేసినట్టు సీఐ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు, ఏప్రిల్, మే నెలల్లో పలువురు రైతులు తమ క్రషర్లు చోరీకి గురైనట్టు ఫిర్యాదు చేశారు. దీంతో విచారణ చేపట్టగా హైదరాబాదుకు చెందిన ప్రసాద్‌రావు, చెరుకువారిపల్లె పంచాయతీ కొత్తపల్లెకు చెందిన ప్రేమకుమార్, రాజశేఖర్, అజిత్‌కుమార్, సునీల్, హరి నిందితులుగా తేలింది. వీరు సదుం మండలంలో 7, పులిచెర్లలో 2, సోమలలో ఒక క్రషర్ చోరీకి చేసినట్టు తేల్చారు. బూరగమంద క్రాస్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులను చూసిన నిందితులు ఆటోలో పారిపోయేందుకు ప్రయత్నించగా పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 3.75 లక్షలు విలువ చేసే క్రషర్ల విడిభాగాలు, ఆటో స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండుకు తరలించినట్టు, బాధిత రైతులకు కోర్టు ద్వారా వారి క్రషర్లను అందజేయనున్నట్టు సీఐ తెలిపారు. కేసు ఛేదనలో చొరవ చూపిన ఎస్ఐ మారుతి బృందాన్ని ఆయన అభినందించారు.

శాస్త్రోక్తంగా శ్రీవారి కల్యాణం



విశేషాలంకరణలో స్వామిఅమ్మవార్లు

రాపూరు: పెంచలకోన క్షేత్రంలో శనివారం పెనుశిల లక్ష్మీ నరసింహ స్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవి కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. బ్రహ్మోత్సవాల అనంతరం వచ్చే మూడో శనివారం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. రాత్రి 7 గంటలకు ఊంజల్‌సేవ నిర్వహించారు.

ఏఈల జీతాల నుంచి రికవరీ

- ఉమ్మడి జిల్లాలో 40 మందికి జీతం కట్
- మొత్తం రూ.160 కోట్లు విలువ చేసే 24,106 వర్క్‌ఆర్డర్లు పెండింగ్



చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లా ట్రాన్స్‌కో పరిధిలో వర్క్‌ఆర్డర్లు క్లోజ్ చేయని ఏఈల జీతాల నుంచి ఆ మొత్తం రికవరీ చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. జిల్లాలో 2018–19వ సంవత్సరం నుంచి ఇప్పటి వరకు 40 మంది ఏఈల పరిధిలో రూ.160 కోట్లు విలువ చేసే 21,060 వర్క్ ఆర్డర్లు క్లోజ్ చేయాల్సి ఉంది. అయితే అవి పెండింగులోనే ఉండడంతో మే నుంచి వారికి జీతాలు చెల్లించకుండా ఆ మొత్తం రికవరీ చేయాలని, అవసరమైతే మిగిలిన అధికారుల జీతాల నుంచి కూడా రికవరీ చేయాలని ఆదేశాలు అందాయి.

వర్క్‌ఆర్డర్లు అంటే..

ట్రాన్స్‌కో పరిధిలో ఎటువంటి పనిచేయాలన్నా అందుకు అవసరమైన విద్యుత్ పరికరాలను తెలుపుతూ అంచనా ఆర్డర్‌ను తయారు చేస్తారు. ఆ వర్క్ ఆర్డర్లను డీఈ, ఈఈలు ఆమోదించిన తరువాత జిల్లా స్టోర్స్‌కు పంపించి పరికరాలను తీసుకుంటారు. ఆ పరికరాలతో క్షేత్రస్థాయిలో విద్యుత్ స్తంభాలు నాటడం, సర్వీసు ఇవ్వడం, లైన్‌లాగడం, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు తదితర పనులు చేశారు. పని అయ్యాక అందుకు వాడిన మెటీరియల్స్, మిగిలినవి లెక్క చూపుతూ వర్క్‌ఆర్డర్‌ను క్లోజ్ చేయాల్సి ఉంటుంది. కొన్ని ప్రాంతాల్లో మెటీరియల్స్ డ్రా చేశాక వినియోగదారుడి పరంగా భూ సమస్య, కోర్టు కేసులు తదితర అంశాలతో ఆ మెటీరియల్‌ను మరో పనికి వాడుకున్నారు. జిల్లాలో మొత్తం దాదాపు 90 మంది వరకు ఏఈలు ఉండగా అందులో 40 మంది ఏఈలు రూ.160 కోట్లు విలువైన 21,060 వర్క్‌ఆర్డర్లను క్లోజ్ చేయాల్సి ఉంది.

అకౌంటిబులిటీ కోసం

ట్రాన్స్‌కో పరిధిలో క్షేత్రస్థాయిలో పనులు చేయాలంటే ఆ శాఖకు సంబంధించి జిల్లా స్టోర్స్‌లో మెటీరియల్స్ కోసం వర్క్‌ఆర్డర్లు పెట్టి డ్రా చేసుకోవాలి. అలా చేసుకున్న వాటిని వినియోగించిన తరువాత ఆ వివరాలు చూపుతూ వర్క్‌ఆర్డర్‌ను క్లోజ్ చేయాలి. పలు కారణాలతో ఏఈలు ఈ పనులు పెండింగ్‌లో ఉంచారు. ఇందులో 10 మందికి పదోన్నతి, బదిలీల్లో భాగంగా విజయవాడ, తిరుపతి, అనంతపురం, కడప, జిల్లాలోని ఇతర డివిజన్లకు బదిలీ అయ్యారు. అధికారులు బదిలీ అయిన, పదోన్నతిపై వచ్చిన వారి పరిధిలో పెండింగ్‌లో ఉన్న వర్క్‌ఆర్డర్లను క్లోజ్ చేయాల్సి ఉంది.

ఆపై ఉన్నతాధికారులు

ఏఈలు వర్క్‌ఆర్డర్లు క్లోజ్ చేయాలని పలుమార్లు జిల్లా అధికారులు హెచ్చరించినా ఎవరూ పట్టించుకోలేదు. దీంతో వారి జీతాల నుంచి రికవరీ చేయాలని ఆదేశాలు ఇచ్చారు. జీతాల నుంచి రికవరీ అలస్యమైతే జేఎంఒ, ఏఓ, డీఈ, ఈఈల జీతాల నుంచి కూడా రికవరీ చేయనున్నారు. ఏఈల జీతాల రూ.60 వేల నుంచి రూ.3 లక్షల వరకు ఉన్నాయి. పలుమార్లు చెప్పినా ఏఈల తీరుమారులేదని, అందుకే జీతాల నుంచి రికవరీ చేస్తున్నట్లు చెప్పారు. అవసరమైతే మిగిలిన అధికారుల జీతాల నుంచి రికవరీ చేస్తామని ఎస్ఈ కృష్ణారెడ్డి వివరించారు.

కారు ఢీ కొని ఇద్దరికి గాయాలు



సెల్‌ఫోన్ టార్చ్ ద్వారా చికిత్స చేస్తున్న వైద్యులు

చిత్తూరు అర్బన్: చిత్తూరు–బెంగళూరు జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మునిసిపల్ కార్పొరేషన్ ఉద్యోగులు తీవ్రంగా గాయపడ్డారు. నగరంలోని మునిసిపల్ లైన్‌కు చెందిన ప్రవీణ్, ఆదిలక్ష్మి పారిశుద్ధ్య కార్మికులు విధులు ముగించుకుని కుక్కలపల్లె నుంచి ద్విచక్ర వాహనంలో చిత్తూరుకు బయలుదేరారు. ఎదురుగా వస్తున్న కారు, ఈ ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టింది. ఇద్దరికీ తీవ్ర గాయాలవడంతో హుటాహుటిన చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న మునిసిపల్ కమిషనర్ అరుణ ఆస్పత్రికి చేరుకుని బాధితులతో మాట్లాడి, మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ ఆసుపత్రి నుంచి బాధితులను సీఎంసీ ఆస్పత్రికి తరలించారు. మరోవైపు క్షతగాత్రులకు ప్రథమ చికిత్స అందించడంలో చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపించింది. ఆసుపత్రిలో అప్పటికే విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. గాయపడ్డవాళ్లను చికిత్స కోసం అత్యవసర విభాగానికి తీసుకొచ్చారు. ఇక్కడ జనరేటర్ ఆన్ చేయకుండా అధికారులు చోద్యం చూశారు. దాదాపు 50 నిముషాల పాటు బాధితులను అత్యవసర విభాగంలో ఉంచి సెల్‌ఫోన్ టార్చ్ లైట్ల ద్వారా కుట్లు వేసి, ప్రథమ చికిత్స అందించారు. అక్కడి వైద్యుల నిర్వాకంపై సర్వత్రా విమర్శలు వచ్చాయి. రోడ్డు ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చిన్నశేషుడిపై గోవిందుడి రాజసం

తిరుపతి కల్చరల్: శ్రీగోవిందరాజస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం స్వామివారు చిన్నశేష వాహనంపై విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. ఉదయం స్వామి వారి వాహన సేవ వేడుకగా సాగింది. గజరాజులు ముందు నడుస్తుండగా మంగళవాయిద్యాలు, కళా ప్రదర్శనల నడుమ స్వామి వారి వాహనసేవ కోలాహలంగా సాగింది. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీగోవిందరాజస్వామివారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. రాత్రి 7 నుంచి 9 గంటల వరకు హంస వాహనంపై స్వామివారు ఊరేగుతూ భక్తులను కనువిందు చేశారు. కళాప్రదర్శనల నడుమ స్వామివారి హంస వాహనదారుడై ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను కనువిందు చేశారు. పెద్ద, చిన్నజీయర్ స్వాములు, కంకణభట్టార్ ఏపీ.శ్రీనివాస దీక్షితులు, డెప్యూటీ ఈవో శాంతి, ఏఈవో రవికుమార్, సూపరింటెండెంట్ నారాయణ పాల్గొన్నారు.

చిత్తూరులో 160 జట్లతో మెగా క్రికెట్ టోర్నీ



యువతకు క్రికెట్ కిట్లను అందజేస్తున్న ఎంసీ విజయానందరెడ్డి

చిత్తూరు రూరల్ : చిత్తూరు నియోజకవర్గంలో మెగా క్రికెట్ టోర్నీ నిర్వహించనున్నట్లు ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ ఎంసీ విజయానందరెడ్డి తెలిపారు. దాదాపు 160 జట్లతో వైఎస్సార్ పీఎల్ఆర్–వీఎస్ఆర్ టోర్నీ పేరిట క్రికెట్ పోటీలు ఉంటాయన్నారు. ఇందుకోసం 160 జట్లకు ఉచితంగా క్రికెట్ కిట్లను శనివారం విజయానందరెడ్డి తన కార్యాలయం వద్ద యువతకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చిత్తూరు కార్పొరేషన్ పరిధిలోని 50 డివిజన్ల నుంచి వంద జట్లు, చిత్తూరు రూరల్, గుడిపాలలోని ప్రతీ పంచాయతీ నుంచి రెండు జట్లు చొప్పున ఈ టోర్నీలో పాల్గొంటాయన్నారు. వచ్చే నెలలో నిర్వహించే టోర్నీలో గెలుపొందిన జట్లకు రూ.2 లక్షలు, రూ.లక్ష, రూ.50 వేలు అందచేయనున్నట్లు చెప్పారు. రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఎంపీలు మిథున్‌రెడ్డి, రెడ్డెప్ప ఈ టోర్నీ ప్రారంభించనున్నట్లు తెలిపారు. నగరంలోని మెసానికల్, పీవీకేఎన్ మైదానాల్లో సుమారు 30 రోజుల పాటు జరిగే టోర్నీలో క్రీడాకారులకు దుస్తుల నుంచి వసతి, భోజనం అన్నీ ఉచితంగా అందజేస్తామన్నారు.

ఎత్తుకు పైఎత్తు!

- హోరాహోరీగా చెస్ టోర్నీ



క్రీడాకారుల ఆటతీరును పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ, చెస్ అసోసియేషన్ వైస్ చైర్మన్

తిరుపతి కల్చరల్: జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బైరాగిపట్టెడలోని గంధమనేని శివయ్య భవన్‌లో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి ఫిడే రేటింగ్ చెస్‌టోర్నమెంట్ రెండో రోజైన శనివారం పోటాపోటీగా సాగింది. క్రీడాకారులు ఎత్తుకు పైఎత్తు వేస్తూ దూసుకుపోయారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తిరుపతి అర్బన్ ఎస్పీ పీ.పరమేశ్వర్‌రెడ్డి హాజరయ్యారు. వీరికి ఆంధ్రా చెస్ అసోసియేషన్ వైస్ చైర్మన్ దివాకర్‌రెడ్డి పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. ఎన్‌టీఆర్ జిల్లాకు చెందిన వజ్రకేఎస్ఆర్‌ఈయూతో స్నేహపూర్వకంగా మ్యాచ్ ఆడారు. అలాగే తిరుపతి జిల్లాకు అంతర్జాతీయ పతకాలు తెచ్చిన త్రిపురాంబిక సోదరీమణులతో ఆత్మీయంగా ముచ్చటించారు. తిరుపతి పోలీస్ శాఖ సహకారంతో తిరుపతి జిల్లా చెస్ అసోసియేషన్ జ్యామ్ ద్వారా ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు చెస్ అసోసియేషన్ తెలపడంతో ఎస్పీ సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో ఆంధ్రా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీవీ.శర్మ, కార్యదర్శి భీమారావు, కోశాధికారి జ్వాలాముఖి, తిరుపతి జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి శ్రీనివాసమూర్తి, టీడీసీఏ పరిపాలనాధికారి బాలాజీ, ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ జిల్లాల సభ్యులు పాల్గొన్నారు.

రౌండ్ 3 తర్వాత కీలక ఫలితాలు

టాప్ సీడ్ వై.గృహేష్ (ఈజీ జిల్లా) అనకాపల్లికి చెందిన మిడిల్ ధనుష్ (1463)తో డ్రాగా ముగిసింది. రెండో బోర్డులో శ్రీకాకుళంకు చెందిన సేతుమాధవ్ (1960)ను వెనక్కి నెట్టి అందాల హేమల్ (144), ఎన్‌టీఆర్ జిల్లాకు చెందిన రేవు వజ్రాక్షులు మూడో రౌండ్ గుణశేఖర్ (1202)తో డ్రాగా ముగిసింది. మూడో రౌండ్ తర్వాత వివిధ జిల్లాలకు చెందిన క్రీడాకారులు 3 పాయింట్లతో ముందంజలో ఉన్నారు. ఇంకా ఐదు రౌండ్లు మిగిలి ఉన్నాయి.